క్లుప్తంగా

శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించుకున్న కృష్ణదాస్


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న కృష్ణదాస్ దంపతులు

జలుమూరు: శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, పద్మప్రియ దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గోలెం చరిత్ర, స్వామివారి కథను వివరించారు. స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి దీవించారు. ఎంపీపీ వానగోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, పైడి విఠల్‌రావు, బగ్గు గౌతమ్, ఎంపీటీసీ సభ్యుడు కె.హరిప్రసాద్, బసవ వెంకటరమణ, పి.విజయ్, లాడి రమేష్, వేణు ఉన్నారు. శ్రీకాకుళంలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామిని కృష్ణదాస్ దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇరుముడుల సమర్పణ


ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారి మాలధరించిన భక్తులు బుధవారం గురుస్వామి నీరంజన్ ఆధ్వర్యంలో ఇరుముడులను సమర్పించారు. స్థానిక ఇందిరమ్మ కాలనీ నుంచి ఆల్‌ఆంధ్ర రోడ్డు మీదుగా అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పొందూరు: ఈ నెల 28, 29 తేదీల్లో కాకినాడలోని డీఎస్‌ఏ స్టేడియంలో జరగనున్న అండర్ 17 బాలికల రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తాడివలస ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.సాయికుమార్, పీడీ డి.పెంటయ్య బుధవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న ఇలపండ రాజ్యలక్ష్మి, పైడి దివ్య, బూరాడ భ్రమరాంబిక ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

స్టడీ మెటీరియల్ వితరణ


జలుమూరులో పుస్తకాలతో విద్యార్థినులు

జలుమూరు: యలమంచిలి జెడ్పీహెచ్‌ఎస్, జలుమూరు బాలికల ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు యలమంచిలి గ్రామానికి చెందిన జుత్తు జగన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పుస్తకాల (స్టడీ మెటీరియల్)ను బుధవారం పంపిణీ చేశారు. సంస్థ ఫౌండర్, చైర్మన్, విశ్రాంత భూగర్భ శాస్త్రవేత్త పదో తరగతి మెటీరియల్ (ప్రాక్టీస్ పేపర్లు)ను సమకూర్చారు. హెచ్‌ఎంలు రఘునాథరావు, ఇప్పిలి వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


హిరమండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం పాతపట్నం మండలంలోని కొరసవాడ, ఎల్.ఎన్.పేట మండలంలోని రావిచంద్రి, మెళియాపుట్టి మండలంలోని మర్రిపాడు-సి, హిరమండలం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం-3, కొత్తూరు మండలం మెట్టూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, ఆయా మండలాల తహసీల్దార్లు, ఏఓలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ధరల మంట

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- పెరగని మెనూ చార్జీలు
- ఆర్థిక ఇబ్బందుల్లో మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలు


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

నియోజకవర్గంలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పాతపట్నం	85	10,550
హిరమండలం	59	4,599
కొత్తూరు	84	7,699
మెళియాపుట్టి	100	6,181
ఎల్.ఎన్.పేట	45	2,389

హిరమండలం: ప్రస్తుతం రూ.5లకు 'టీ' కూడా రావడం లేదు. అలాంటిది ఒక విద్యార్థికి రూ.5.88లకు భోజనం పెట్టాలంటే సాధ్యమేనా అని మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. పాత మెనూతోనే నాణ్యమైన, రుచికరమైన భోజనం వండి పెట్టాలంటే ఎలా సాధ్యమంటున్నారు. నెలవారీ బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో తమకు వంట చేయడం సవాల్‌తో కూడుకున్నదేనని అంటున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసరాల ధరల పెరుగుదల మంట పుట్టిస్తోంది. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా కూటమి ప్రభుత్వం బడ్జెట్ పెంచకపోగా, నెలవారీ బిల్లులు సైతం సక్రమంగా ఇవ్వడంలేదు. పథకం పేరు మార్చిందే తప్ప.. మెనూ చార్జీలు పెంచలేదు. భోజనంలో నాణ్యత తగ్గుతోందనే విమర్శలున్నాయి. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నా రుచిలో తేడాలు కనిపిస్తున్నాయి.

గతంలో మార్పులు..

గత ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిత్యవసరాల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు మార్పులు చేస్తుండేది. దీంతో వంట ఏజెన్సీలకు ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుత ప్రభుత్వం వీటిని పట్టించుకోవడంలేదు.

పాత చార్జీలే అమలు..

ప్రస్తుతం నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిగాయి. వంట నూనెలు లీటరుకు రూ.30 వరకు పెరిగాయి. కందిపప్పు రూ.160లకు చేరింది. వెల్లుల్లి కిలో రూ.400 పైనే పలుకుతుంది. శనగ పలుకులు కిలో రూ.140, పెసలు రూ.130లకు చేరాయి. ఇలా ఆహార పదార్థాల్లో వినియోగించే అన్ని సరుకుల ధరలు భారీగా పెరిగాయి. కూరగాయలు ధరలు చెప్పనవసరం లేదు. ఏ కూరగాయలు కొనాలన్నా రూ.60 పైనే ఉన్నాయి. ఖర్చులు రెట్టింపు అయినా.. పాత చార్జీలనే అమలు చేస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థికి రూ.5.88, 6 నుంచి 10వ తరగతి వరకు రూ.8.57 చెల్లిస్తున్నారు.

రేట్లు పెరిగిపోయాయి



నిత్యవసర సరుకులు, కూరగాయల ధరలన్నీ భారీగా పెరిగిపోయాయి. ప్రభుత్వం ఇచ్చే ధరలతో మధ్యాహ్న భోజనం వండడం భారంగా మారింది. బిల్లు కూడా సక్రమంగా రాకపోవడంతో అవస్థలు పడుతున్నాం. పెరిగిన రేట్లుకు అనుగుణంగా బిల్లులు అందిస్తే బాగుంటుంది.

– కంటి భాను, మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలు

భారంగా మారింది



పెరిగిన నిత్యవసర సరుకుల తోపాటు కూరగాయ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో మధ్యాహ్న భోజనం వంట భారంగా మారింది. మెనూ ప్రకారం నాణ్యతగా, రుచికరంగా వండాలంటే అప్పులు చేయాల్సి వస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు, వంట ఏజెన్సీలకు గౌరవవేతనం పెంచాలి.

– కోల ఆదిలక్ష్మి, మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలు

మెనూ చార్జీలు పెరగలేదు



మధ్యాహ్న భోజనం మెనూ చార్జీల పెంపు సమాచారం ఇంకా రాలేదు. పాత మెనూ చార్జీలే అమలవుతున్నాయి. అన్ని పాఠశాలల్లోనూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీలకు సూచించాం. ధరలు పెరిగిన మాట వాస్తవమే. మెనూ చార్జీల పెంపు ప్రభుత్వం పరిధిలోనిది. ఈ అంశంపై అక్కడ నుంచే చర్యలుంటాయి.

– కె.రాంబాబు, ఎంఈఓ, హిరమండలం

ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్



ఆమదాలవలస: రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు చాలావరకు వరి కోతలు, నూర్పిడిలు పూర్తి చేసి, ధాన్యం బస్తాలను పొలాలు, కళ్లాల్లో నిల్వ చేశారన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవటమంటే.. రైతులను నిర్లక్ష్యానికి గురిచేయటమేనని గుర్తుచేశారు. గత సంవత్సరం తమ ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా నవంబర్ 2వ తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వంలో నవంబర్ పూర్తి కావస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవటం శోచనీయమన్నారు. రైతులు తక్కువ ధరలకే దళారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోతున్నారన్నారు. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖా మంత్రి ఈ జిల్లాకు సంబంధించిన వ్యక్తి అయినప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించకపోవటం చాలా బాధాకరమన్నారు. తక్షణమే తగిన చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని వినతి


ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సారవకోట: తమపై పని ఒత్తిడి తగ్గించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్‌కు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం వినతిపత్రం అందించారు. తమకు కేటాయించిన పనులతో పాటు ఇతర పనులు కేటాయించడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని, దీని వలన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. అనేక యాప్‌లలో వివరాలు నమోదు చేయాలని సూచిస్తున్నారని, దీని వలన ఎంతో మానసిక శ్రమను ఎదుర్కొంటున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు సింహాచలం, మురళి, గౌరీశంకర్, జ్యోతి, సుబ్బినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ


పుస్తకాలను చూపిస్తున్న విద్యార్థులు, సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు

కొత్తూరు: మండలంలోని కురిగాం ఎస్సీ బాలుర వసతిగృహం విద్యార్థులకు డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ సేవా సంఘం సభ్యులు నోట్ పుస్తకాలు, పెన్నులు, అట్టలు, కాపీ రైట్ బుక్స్‌తోపాటు పలు రకాల పుస్తకాలను బుధవారం సంఘం అధ్యక్షుడు అల్లాడ రమేష్ ఆధ్వర్యంలో అందజేశారు. వసతి గృహం పూర్తిగా పాడవడంతో విద్యార్థులకు రాత్రిపూట కురిగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వసతి కల్పించిన హెచ్‌ఎం నిర్ణయం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం ఈశ్వరరావు, వార్డెన్ కృష్ణారావు, సంఘం కోశాధికారి ధర్మారావు, కోల రమేష్, సభ్యులు, వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం


గడ్డెయ్యవాని చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక గడ్డెయ్యవాని చెరువులో రామలింగేశ్వరస్వామి తెప్పోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. శివనగర్‌కాలనీతోపాటు సమీప వీధులకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ తెప్పోత్సవాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. శివనగర్‌కాలనీ, దేశవానిపేట, వజ్రంపేటల్లో స్వామివారి తిరువీధి నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాతపట్నం: ఈ నెల 29వ తేదీన మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేపడతామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు పాతపట్నం, బూరగాం, కాగువాడ, కొరసవాడ, బోరుభద్ర, గురండి, బగదల, కాపుగోపాలపురం, సీతారాంపల్లి, చంగుడి, సరాలి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

బూర్జ: మండలంలోని ఓ.వి.పేట ఏపీ మోడల్ స్కూల్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ బుధవారం పరిశీలించారు. టీచింగ్, నాన్ టీచింగ్, విద్యార్థుల వివరాలను ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావుకు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. మోడల్ స్కూళ్లల్లో పనిచేస్తున్న వాచ్‌మేన్ అండ్ అటెండర్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి పాఠశాల వాచ్‌మేన్ అండ్ అటెండర్ జి.నీలాద్రి వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరిగుంట గ్రామానికి చెందిన కె.తిరుమల నడుచుకుంటూ సారవకోట వైపు వెళ్తున్నాడు. వెనుకనుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనదారుడు కూడా తీవ్రగాయాలపాలయ్యాడు. ద్విచక్ర వాహనదారుడి వివరాలు తెలియరాలేదు. ఇద్దరినీ 108లో నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బదిలీ వీఆర్వోలకు సత్కారం

నరసన్నపేట: మండలంలో వివిధ రెవెన్యూ గ్రామాల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన వీఆర్వోలకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సత్కరించారు. తహసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రీ సర్వే డీటీ గాయత్రి, వీఆర్వోలు మార్రెళ్ల అప్పలనాయుడు, పంగ వెంకటేశ్వరరావు, మెండ శ్రీను, పాగోటి రేవతి, బలగ రాము, దామోదర్‌ను సత్కరించారు. సర్వేయర్ అప్పలస్వామి, వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆందోళన


నరసన్నపేట: మతలబుపేట వద్ద కుప్పలు పెడుతున్న రైతు కుటుంబం


నరసన్నపేట: కరగాం వద్ద ధాన్యం నిల్వలపై టార్పాలిన్లు కప్పిన రైతులు


మెళియాపుట్టి: శేఖరాపురంలో రహదారి పక్కన ధాన్యం నిల్వ చేసిన రైతులు


కొత్తూరు: కూర్మదాసుపురం వద్ద కళ్లంలో ఉన్న ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పుతున్న రైతులు

నరసన్నపేట, మెళియాపుట్టి, కొత్తూరు: వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం నుంచి పొలాల్లోనే ఉంటూ వరి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేశారు. కుటుంబ సభ్యులందరూ పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వరి ఓవులను(పనలు) కుప్పలుగా పెట్టారు. నూర్పిడిలు చేస్తూ కొందరు కనిపించారు. కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంతో ధాన్యాన్ని కళ్లాల్లో పోగులు వేసి టార్పాలిన్లు కప్పి భద్రపర్చారు. వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. కోతలు కోయవద్దని, ఉన్న పంటను కుప్పలుగా పెట్టుకోవాలని, ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని గ్రామాల్లో దండోరా వేయించారు.

బోరు బాగుచేయరూ..



బూర్జ మండలంలోని కాలపర్తి పంచాయతీ హనుమయ్యపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలోని బోరును బాగు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న చేతి పంపు పాడై చాలా రోజులైంది. సంబంధిత అధికారులు స్పందించి బోరును బాగు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

– బూర్జ

రోడ్డుపైనే మురుగునీరు



కొత్తూరు మండలంలోని నివగాం గ్రామ ఎస్సీ వీధి సమీపంలో మురుగునీరు ప్రవహిస్తోంది. పాలకొండ-హడ్డుబంగి ప్రధాన రహదారి కావడంతో ప్రతి రోజూ వందలాది వాహనాలు (ఆంధ్ర-ఒడిశా) రాకపోకలు చేస్తున్నాయి. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్లల్లోని వాడుక నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– కొత్తూరు

నిరుపయోగం



సారవకోట మండలంలోని అన్నుపురం పంచాయతీ వాబ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం నిరుపయోగంగా ఉంది. ఇక్కడి పాఠశాలను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులు లేరని రద్దు చేశారు. ఈ గ్రామంలోని విద్యార్థులు పక్కనున్న అన్నుపురం పాఠశాలకు వెళ్తున్నారు. పాఠశాల భవనాన్ని స్థానికులు స్టోర్ రూమ్‌గా వాడుకుంటున్నారు.

– సారవకోట

భయపెడుతున్నాయ్..



ఎల్.ఎన్.పేట మండలం తురకపేట సెంటర్‌లో వీధి కుక్కలు భయపెడుతున్నాయి. గుంపులుగా సంచరిస్తూ ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయి. మార్కెట్‌కు వచ్చేందుకు స్థానికులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన వారు భయపడుతున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

అయ్యప్ప స్వామికి లక్ష పుష్పార్చన



పొందూరులోని పైడితల్లి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో బుధవారం అయ్యప్ప స్వామికి లక్ష పూలతో పూజను నిర్వహించారు. అనకాపల్లి శివకుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 21 రకాల పత్రాలు, 21 రకాల పూలు, 21 రకాల ఫలహారాలతో పూజను భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

– పొందూరు

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

సారవకోట: బాలికల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిశోర బాలిక వికాసం కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, మహిళా పోలీసులకు శిక్షణ నిర్వహించారు. సీడీపీఓ కామాక్షి, ఎంఈఓ ఎం.వి.రమణ, వైద్యుడు వాన దేవిక, ఈఓపీఆర్డీ ప్రభాకరరావు ఉన్నారు.

జలుమూరు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ కె.అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కిశోర బాలిక వికాసం కార్యక్రమంలో మాట్లాడారు. సైబర్ క్రైమ్, మహిళల అక్రమ రవాణా, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: బాల్య వివాహాల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని ఎంపీడీఓ రోణంకి వెంకటరావు అన్నారు. బుధవారం ఎంపీడీఓ, ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ రాంబాబు, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, మండల పరిషత్ కార్యాలయం ఏఓ వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

వాహన తనిఖీలు

కొత్తూరు: మండలంలోని నివగాం రోడ్డులో స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన పత్రాలులేని వారిపై కేసులు నమోదు చేశారు. త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆంధ్ర – ఒడిశా సరిహద్దులో..

మెళియాపుట్టి: ఆంధ్ర – ఒడిశా సరిహద్దుల్లో వాహనాల రాకపోకలపై నిఘా పెంచినట్లు మెళియాపుట్టి ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. మండలంలోని ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని వసుంధర చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహన తనిఖీలను నిర్వహించారు. టెక్కలి ఎస్‌ఈబీ ఎస్‌ఐ లావణ్య, పోలీసులు పాల్గొన్నారు.

హోమియో వైద్యంపై అవగాహన

సారవకోట: హోమియో వైద్య సేవలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తిలారు హోమియో వైద్యుడు పి.శంకరరావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ ఆధ్వర్యంలో హోమియో, ఆయుర్వేద వైద్య సేవలపై ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. హోమియోలో పలు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే అవకాశం ఉందన్నారు. వైద్యులు దేవిక, సీహెచ్‌ఓ పద్మావతి పాల్గొన్నారు.

ఆదుకోవాలని వినతి

ఎల్.ఎన్.పేట: విధులు నిర్వహిస్తూ మరణించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని మండలంలోని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కోరారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు రావిచంద్రి కేంద్రం వద్ద వినతిపత్రం అందజేశారు. కొత్తూరు ప్రాజెక్టు పరిధిలోని పలు గ్రామాలకు చెందిన నలుగురు అంగన్‌వాడీ సిబ్బంది అనారోగ్య కారణంగా మృతి చెందారని వివరించారు. ఆయా కుటుంబాల్లో అర్హత ఉన్నవారికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. యూనియన్ నాయకులు ఎం.సుదీష్ణ, సుభాషిణి, నిర్మల, లక్ష్మి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఆమదాలవలస: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో రెండో వార్డు కృష్ణాపురం, మోణింగివారి వీధి సచివాలయం నంబర్-1, 2లను తనిఖీ చేశారు. కృష్ణాపురం సచివాలయంలో కార్యదర్శులు హాజరు రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించనందున మెమోలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన సర్వేలు, ఎన్‌పీసీఐ బ్యాంక్ అకౌంట్లకు యాక్టివేట్ చేయడం, అపార్‌కు సంబంధించి ఆధార్ డేటా సవరించడం, భూముల రీ సర్వే డోర్ టు డోర్, హౌస్ హోల్డ్ క్లస్టర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ సోలార్ పథకం, హౌసింగ్ లోన్ మంజూరు వంటి సర్వేలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇళ్ల, కుళాయిల పన్నుల వసూలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

మెళియాపుట్టి: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని స్థానిక వైద్యారోగ్య శాఖ సిబ్బంది అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా బరువు, ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. చదువులో రాణించడానికి ఆరోగ్యం ముఖ్యమన్నారు. ఏఎన్‌ఎంలు ప్రమీల, సుజాత, బాలామణి, చంద్రకళ, ఉపాధ్యాయులు, ఆశలు స్వర్ణలత పట్నాయక్, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.